క్లుప్తంగా

వైభవంగా చండీయాగం

రేపల్లె: అధిక శ్రావణమాసం సందర్భంగా పేటేరు గ్రామదేవత మహాలక్ష్మి గుండెపాటెమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి శ్రీనివాసరావు–నాగేశ్వరమ్మ దంపతులు చండీయాగం చేశారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. మహిళలకు పసుపు కుంకుమ, చీరలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మణిపూర్ ఘటనపై నిరసన



చుండూరు(వేమూరు): మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని చుండూరు మండల పాస్టర్లు ఫెడరేషన్ అధ్యక్షుడు మన్నవ రమేష్ అన్నారు. మండలంలోని దైవ సేవకుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై దాడులకు నిరసనగా పాస్టర్లు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాస్టర్లు జి.యోహాను, ఎం.జోషి, రెవ కె.యాకోబు, కె.అబ్రహం, ఐ.కృపారావు పాల్గొన్నారు.

రేపల్లె ఏఓగా వాగోలు బుష్ బాధ్యతలు



రేపల్లె రూరల్: మండల వ్యవసాయశాఖ అధికారిగా వాగోలు బుష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న రాగాల విజయ్‌బాబు డిప్యూటేషన్‌పై జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా బుష్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. సాగులో రైతులకు సహాయపడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషిచేస్తానన్నారు.ఈ సందర్భంగా ఆయనకు వ్యవసాయ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాఠశాలకు ఇద్దరు చిన్నారులు

భట్టిప్రోలు: అమృతలూరు మండలం ఇంటూరులోని ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను మంగళవారం పారా లీగల్ వలంటీర్ (పీఎల్వీ) బొర్రు రవీంద్ర సమక్షంలో తహసీల్దారు పి.మెహర్‌కుమార్ సూచన మేరకు చేరిపించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు ఎటువంటి ఆధార్ కార్డులు లేకపోయినప్పటికి ఎన్‌రోల్‌మెంట్ చేయించి అధికారులు పాఠశాలలో చేర్పించారు. అమృతలూరు మండల కమిటీ సమాచార హక్కు చట్టం ఉపాధ్యక్షుడు వారి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె: కాపు సేవా సమితి 14వ వార్షికోత్సవం సందర్భంగా అందించే ఉపకార వేతనాలకు రేపల్లె పాత డివిజన్ పరిధిలోని ప్రతిభ గల కాపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సమితి సభ్యుడు కె.శివశంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రేపల్లె నియోజకవర్గం, భట్టిప్రోలు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 82478 94595 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

నేడు పల్లెకోనలో 'గడప గడపకు'

భట్టిప్రోలు: పల్లెకోనలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని తెలిపారు.

ఇతర జిల్లాలకూ అందించినారు

- వరినారుకు కేరాఫ్‌గా రాంబొట్లపాలెం
- ఇసుక నేలలు 350 ఎకరాల్లో వరి నారుసాగు
- వర్షాలొచ్చినా..వరదలొచ్చినా.. దెబ్బతినే శాతం తక్కువ
- నారు అమ్మకాలతో.. లాభాలు గడిస్తున్న రైతులు
- ఇతర జిల్లాల రైతులకు సరఫరా



నారు కట్టలు కడుతున్న మహిళలు

చెరుకుపల్లి: డెల్టా ప్రాంతంలో వరి నారుకు ప్రసిద్ధి రాంబొట్లపాలెం. వ్యవసాయ సీజన్ మొదలవుతుంది అనగానే వరినారు పోసేందుకు ఆ గ్రామ ప్రజలు ఇసుక దిబ్బలను సిద్ధం చేస్తారు. జిల్లా చుట్టు పక్కల రైతులు గ్రామ పరిసరాల్లోనే బాడుగకు నారు పెంచేందుకు స్థానిక రైతులతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటారు. దీనికి కారణం మాగాణిలో పోసిన నారు కంటే ఇసుక దిబ్బలపై పోసిన వరి నారు తేలికగా పీకటానికి వీలుగా ఉంటుంది. నాటిన ప్రతి మొక్క కూడా త్వరగా ఎదుగుతుంది. దీనికి తోడు మాగాణి భూముల్లో పోసిన నారుమడి అధిక వర్షాలకు నీట మునిగితే త్వరగా దెబ్బతింటుంది. కానీ ఎంత వర్షం వచ్చినా.. ఇసుక నేలలో నారు వేసిన వారికి ఆభయం లేదు. దురదృష్టవశాత్తు రైతుల వరి నాట్లు వేసిన కొద్ది కాలానికే పొలాలు ముంపునకు గురై పంట దెబ్బతిన్నా.. వెంటనే మళ్లీ నాటుకోవటానికి ఈ ప్రాతంలో వరినారు జూన్ నుంచి అక్టోబరు, నవంబరు మాసాల్లో అందుబాటులో ఉంటుంది.

జిల్లాలు దాటించినారు...

ముందుగా వరి నాట్లు వేసుకునే రైతులు నారు కోసం ఇక్కడికి వస్తుంటారు. కృష్ణ జిల్లా అవనిగడ్డ, నాగాయిలంకతో పాటు గుంటూరు, నరసరావుపేట ఏరియా రైతులు ఇక్కడ అధిక ధర వెచ్చించి నారు కొనుగోలు చేస్తారు. దీనికి కారణం నారు వివిధ దశల్లో ఉండటమే. ఈ ఏడాది ప్రారంభంలో సెంటు నారు రూ.13 వందల నుంచి రూ.15 వందల వరకూ గిరాకీ ఉండటంతో నారు పోసిన రైతులు సంతోషంగా ఉన్నారు.



రాబొట్లపాలెంలో సాగు చేస్తున్న వరినారు

1.ఈ ప్రాంతంలో ఉన్న వరినారు మడుల విస్తీర్ణం సుమారు 350 ఎకరాలు.
2.ఒప్పందంపై సాగుచేసిన నారు 60ఎకరాల పైనే.
3. వరి రకాలు బీపీటీ 5204, నెల్లూరు సన్నాలు ఎక్కువగా ఇక్కడ సాగు చేస్తారు. దీంతో వరి నారుకు కేరాఫ్ రాంబొట్లపాలెంగా రైతులు అంటున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- పల్లెకోనలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పల్లెకోనలో మహిళకు సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

పల్లెకోన(భట్టిప్రోలు): సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. పల్లెకోన, ఆళ్లమూడి పంచాయతీల్లో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జునకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి మంత్రి మేరుగ గడప గడపకు వెళ్లి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందించారు. మహిళలు మంత్రికి హారతులు పట్టారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు మంత్రి సూచనలు ఇచ్చారు.

సుపరిపాలనతో హర్షాతిరేకాలు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సుపరిపాలనతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని మంత్రి నాగార్జున పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో లెక్కకు మించి ప్రతి కుటుంబానికి అందటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలన్నదే జగనన్న ఆకాంక్ష అని చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాల కంటే ఎక్కువగా సీఎం జగన్ అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్‌కుమార్, పెద్దిశెట్టి రాంబాబు, జయవరపు రాధాకృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరపతిబాబు, మండల జేసీఎస్ కన్వీనర్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మండవ రామకోటేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పులివర్తి సుధాకర్, పెద్దిశెట్టి వెంకటేశ్వరావు, అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అవినీతి రహితం..పాలనలో పాదర్శకం జగనన్న ప్రభుత్వం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- దిండి పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



దిండిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: అవినీతికి తావులేనిది జగనన్న ప్రభుత్వమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిండి పంచాయతీ నర్రావారిపాలెం, పరిశావారిపాలెం, యేమినేనివారిపాలెం, జంపనివారిపాలెం, కేసనవారిపాలెం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, కరపత్రాలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ.. అవినీతి రహిత పాలన చేస్తున్న ఏకైక నాయకుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని అమలుపరుస్తున్న జగనన్నను ప్రజలు మద్దతుగా నిలిచి, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, సర్పంచ్ యేమినేని రాంబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రేపల్లె: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ కోరారు. సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిరసన చేపట్టారు. శాశ్వత కార్మికులుగా గుర్తించాలని మణిలాల్ అన్నారు. కార్మికులను ఆప్కాస్ బోర్డులో చేర్చడం తగదన్నారు. కోవిడ్ వారియర్స్‌గా ప్రాణాలకి తెగించి సేవలు అందించిన మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్ వర్కర్లుగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు, 17న చలో విజయవాడ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు డి.శివ, కార్మికులు జాని, వేంకటేశ్వరరావు, రబ్బాని, రాజ్యలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి



కర్లపాలెం: బైక్ మెకానిక్‌లను ప్రభుత్వం అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ధర్మారావు అన్నారు. మంగళవారం కర్లపాలెంలో భావపురి టూవీలర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. 50 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.10వేల పింఛను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మెకానిక్‌లు షేక్ ఆసిఫ్ అలీ, సయ్యద్ ఏజెస్, మీరావలి, వాసు, శ్రీను, భావన్నారాయణ, సుభానీ, బాబు, చాంద్‌భాషా, రహమతుల్లా పాల్గొన్నారు.

'కొబ్బరి చిప్పల' ఆదాయం రూ.35 వేలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కు కోసం బహిరంగ వేలాన్ని ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఈఓ నరసింహమూర్తి వేలం వివరాలు వెల్లడించారు. బాపట్ల డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్యామల ఆధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు తెలిపారు. 14 మంది సభ్యులు హాజరు కాగా ఐదుగురు డిపాజిట్ చెల్లించినట్లు చెప్పారు. అత్యధికంగా రూ.35వేలకు కుంచల శ్రీనివాసరెడ్డి పాట దక్కించుకున్నట్లు వెల్లడించారు. గతం కంటే రూ.4,400 ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, దేవస్థానం పూజారులు కుంచల నరసారెడ్డి, దొంతిబోయిన బల్లారెడ్డి, భానుచంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

పెదనాన్నపై తమ్ముడు కొడుకు కత్తితో దాడి

బాపట్లటౌన్: ఇంటి స్థలం విషయంలో పెదనాన్నపై తమ్ముడి కొడుకు విచక్షణా రహితంగా కత్తితో దాడిచేసిన ఘటన మంగళవారం అసోదివారిపాలెంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు..అసోదివారిపాలెం గ్రామానికి చెందిన మేడిబోయిన సుబ్బారెడ్డి, అతని తమ్ముడు కొడుకు మెడిబోయిన స్వామిరెడ్డిలకు 12 సెంట్ల స్థలం విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. స్థలం విషయమై ఇరువురు కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మేడిబోయిన సుబ్బారెడ్డి గేదె పాలు తీసేందుకు చావిడికి వచ్చాడు. ఒక్కడే ఒంటరిగా ఉండటాన్ని గమనించిన స్వామిరెడ్డి వెనుక నుంచి వచ్చి రెప్పపాటులోనే కత్తితో విచక్షణా రహితంగా సుబ్బారెడ్డిపై దాడిచేశాడు. సుబ్బారెడ్డి మొహం మీద, తలపై, వెనుకభాగంలో ఎక్కడపడితే అక్కడ తీవ్రంగా నరికాడు. తీవ్ర రక్తపు మడుగులో పడి ఉన్న సుబ్బారెడ్డిను స్థానికులు చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికం



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



ఎంవీరాజుపాలెంలో అంగన్‌వాడీల ర్యాలీ

కొల్లూరు: తల్లిపాలు తాగే పిల్లల్లో పోత పాలు తాగే పిల్లల కంటే రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లూరు బైపాస్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలను తాగించడంతో పాటు, ప్రతి రోజు పాలివ్వడం వల్ల చిన్నారులు అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని వివరించారు. పోతపాలు తాగే పిల్లలు అను నిత్యం అనారోగ్యానికి గురవుతుండటానికి కారణం రోగనిరోధక శక్తి ఉండకపోవడమేనని సూపర్‌వైజర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం


కర్లపాలెం: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ కర్లపాలెం సెక్టార్ ఇన్‌చార్జ్ కె.వసంతకుమారి అన్నారు. కర్లపాలెం పంచాయతీ ఎంవీరాజుపాలెంలో జాలమ్మ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాల ర్యాలీ గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతకుమారి, పద్మ, వాణి, అరుణ, ధనలక్ష్మి, పార్వతి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

దాసరిపాలెం(భట్టిప్రోలు): గొరిగపూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలేనికి చెందిన గొర్రుముచ్చు రమేష్ కుమారుడు, కుమార్తె బాలకృష్ణ, సుజనీలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల గుడివాడ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి విభిన్న ప్రతిభావంతులైన ఆ చిన్నారుల పరిస్థితిని మంత్రి నాగార్జున తీసుకెళ్లారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ స్పందించి వారికి రూ.3 లక్షల చెక్కును పంపారు. గ్రామ సర్పంచ్ గరిగపాటి మల్లిక, ఎంపీటీసీ వరికూటి పున్నయ్య, మాజీ ఎంపీటీసీ సముద్రాల యాకోబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

ఐలవరంలో 5 కిలోలు గంజాయి స్వాధీనం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల డీఎస్పీ టి.మురళీకృష్ణ వివరాల మేరకు.. బిందు (చీరాల), గోవాడ భాను ప్రసాద్ (వెల్లటూరు), షేక్ ఆరీఫా (కొలకలూరు), షేక్ సైఫా (కొలకలూరు), చుక్కా శ్రీకాంత్ (గుంటూరు)ను సమాచారం మేరకు ఐలవరం బస్టాండ్ వద్ద అరెస్టు చేశామని తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశానుసారం, బాపట్ల డీఎస్పీ టి. మురళీకృష్ణ సూచనల మేరకు రేపల్లె సీఐ నజీర్ బేగ్, వేమూరు ఎస్ఐ జె.నాగరాజు, భట్టిప్రోలు తహసీల్దారు డి.వెంకటేశ్వరరావు సమక్షంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను బుధవారం రేపల్లె కోర్టులో హాజరుపరచనున్నారు. బిందుతో సహజీవనం చేస్తున్న వీరాంజనేయులను గతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఓటర్ల జాబితా త్వరితగతిన పూర్తిచేయాలి

రేపల్లె: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వేను వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆర్డీవో జగన్నాథం పార్థసారథి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్వేలో తప్పొప్పులు సవరించటంతో పాటు కొత్త ఓటర్ల వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దారు మల్లికార్జునరావు, కమిషనర్ విజయసారథి తదితరులు పాల్గొన్నారు.